
సాక్షి మంచిర్యాల

శనివారం । 3 । ఆగస్టు । 2024



కుప్టి.. కదలిక

ఎట్టకేలకు కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణానికి అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించింది. సాగునీటి, రెవెన్యూ అధికారులు భూపరిశీలన చేశారు. 8లో▸



మొక్కలతోనే మానవ మనుగడ

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. పాత బెల్లంపల్లి అటవీ ప్రాంతంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురుస్తుంది. సాయంత్రం అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

15న కూరగాయల మార్కెట్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో రూ.7.58 లక్షలతో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను పంద్రాగస్టు రోజు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీలో చేపట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. 25 ఏళ్ల అనుభవం కలిగిన సీనియర్ వ్యాపారులకు 54 స్టాళ్లను లక్కీ డ్రా ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు. మరో 54 స్టాళ్లు, 28 షట్టర్లను వ్యాపారులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. స్టాళ్లు పొందినవారే వ్యాపారం కొనసాగించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో ప్రవేశాలకు మూడో దఫా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రూ.100 వెరిఫికేషన్ రుసుం చెల్లించి ట్రేడ్‌ల ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్‌తో దరఖాస్తును ఆన్‌లైన్‌లో అందించాలని తెలిపారు. ఆన్‌లైన్ మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.


జాప్యం లేకుండా కనెక్షన్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఆలస్యం లేకుండా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. గతేడాది 922 కనెక్షన్లు మంజూరు చేయగా, ఈ ఏడాది ఇప్పటివరకు 1,495 సర్వీసులు మంజూరు చేశామని చెప్పారు. గతేడాది కంటే అదనంగా 573 కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మరమ్మతులకు సంబంధించి ఈ స్టోర్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన పరికరాలు, కావాల్సిన సమయంలో తీసుకుని పనులు త్వరగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన స్తంభాలు, లూజ్ లైన్‌లను సరిచేస్తామని పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు.

మూడు టీఎంసీలు తగ్గిన 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి (శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ నీటి మట్టం నాలుగు రోజుల్లో మూడు టీఎంసీలు తగ్గింది. వర్షాలు లేక ఎగువ ప్రాంతాల నుంచి వరద నిలిచింది. ప్రాజెక్ట్ నీటిని నంది పంప్‌హౌస్‌కు తరలిస్తుండటంతో నీటి మట్టం తగ్గింది. శుక్రవారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా, 146.40 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు గాను 15.900 టీఎంసీలుగా ఉంది. 3,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 310 క్యూసెక్కులు, నంది పంప్‌హౌస్‌కు 13 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అసెంబ్లీలో సింగరేణి ఇళ్ల పట్టాల సమస్య



కూనంనేనికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: అసెంబ్లీలో సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ప్రస్తావించారు. సింగరేణిలో 76 జీవో కింద కొన్ని ఏరియాల్లో ఇప్పటికీ పట్టాలివ్వలేదని సభ దృష్టికి తెచ్చారు. ఈ జీవో ప్రకారం కొన్ని ఏరియాల్లో పట్టాలిచ్చినా ఇంకా కొన్ని చోట్ల ఇవ్వలేదని తెలిపారు. వీటిని కూడా వెంటనే ఇవ్వాలని సంబంధిత మంత్రిని కోరారు. అంతకుముందు శ్రీరాంపూర్ నుంచి సీపీఐ నాయకులు, 17వ వార్డు కౌన్సిలర్ మేకల దాసు, నాయకులు రామన్న, మహేశ్ తదితరులు అసెంబ్లీలో సీపీఐ ఎల్పీ కార్యాలయంలో కూనంనేనిని కలిసి ఇళ్ల పట్టాల సమస్య ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరాంపూర్ ఏరియాలోని హిమ్మత్‌నగర్, సుందరయ్యనగర్, కృష్ణమూర్తి నగర్, అంబేద్కర్ నగర్, సాయిబాబా గుడి ఏరియా, రాజీవ్‌నగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, బుడిగజంగాల కాలనీ, కృష్ణకాలనీలో పట్టాలు రాలేదని ఆయనకు తెలిపారు.

ఇంటి ముంగిటకే వైద్యం..!

- వైద్య విద్యార్థులకు 'దత్తత' బాధ్యత
- తప్పనిసరి చేసిన మెడికల్ కౌన్సిల్
- కుటుంబానికో విద్యార్థి కేటాయింపు
- వైద్యశిబిరాలతో వ్యాధుల నిర్ధారణ
- నాలుగేళ్లు కొనసాగనున్న సేవలు



మజీద్‌వాడలో దత్తత కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: వైద్యసేవలను ఎంతగా విస్తృత పరిచినా ప్రజలకు సకాలంలో పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. పేద ప్రజల్లో ఆరోగ్య సమస్యలున్నా వాటికి చికిత్స చేయించుకోకుండానే బతుకు వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చెంతకు చేరుస్తున్నా పరీక్షలు చేసుకునేందుకు కొందరు ముందుకు రావడం లేదు. ఏదైనా వ్యాధి సోకి ప్రాణాల మీదకు వచ్చేదాకా కొందరు ఆస్పత్రికే వెళ్లరు. అలాంటి వారికి మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు తోడుగా నిలుస్తున్నారు. ఆర్ఎంపీలు, వైద్యంపై అవగాహన లేని కొందరు వ్యాధులకు వారికి నచ్చినట్లు చికిత్స చేస్తూ, ఆయా వ్యాధులు మరింత ముదిరేలా చేస్తున్నారు. విచ్చలవిడిగా నొప్పుల మాత్రలు, యాంటీ బయాటిక్స్, ఇతర మందులు ఇస్తున్నారు. ఈ క్రమంలో నిరుపేద ప్రజలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల్లో నివాసముంటున్న కుటుంబాలను ఎంబీబీఎస్ విద్యార్థులకు దత్తత ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు, వివిధ వ్యాధులపై అవగాహన, ప్రాక్టీస్ లభించేందుకు గాను దత్తత కార్యక్రమాన్ని వీరికి పాఠ్యాంశంగా చేర్చారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిర్ణయం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు ఒక గ్రామం, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవడం తప్పనిసరి చేశారు. దీంతో 200 మంది మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు మంచిర్యాల పట్టణంలోని మజీద్‌వాడ, మెయిన్‌పుర వాడల్లోని కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఇటీవల ఆ రెండు వాడల్లోని ప్రజలందరికీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య సమస్యలు గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కొందరిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నాలుగేళ్ల దాకా వీరిదే బాధ్యత..

ఎన్ఎంసీ నిర్ణయం మేరకు ఎంబీబీఎస్‌లో చేరిన వైద్య విద్యార్థులకు ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం (ఎఫ్ఏపీ)ని ఒక సబ్జెక్ట్‌గా చేశారు. మొదటి సంవత్సరం నుంచే ఒక్కో విద్యార్థికి ఒక్కో కుటుంబాన్ని అప్పగిస్తారు. ప్రతీ వారం విద్యార్థులు ఆయా కుటుంబం వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని నోట్స్ రూపంలో రాసుకుంటారు. ఇందుకోసం విద్యార్థులకు తోడుగా అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉంటారు. దత్తత ఇచ్చిన ఆ కుటుంబంలోని అందరి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు వారి ఆరోగ్య సమస్యల వివరాలు పరిశీలిస్తారు. ఎవరికైనా.. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే తక్షణమే టెలిమెడిసిన్ పద్ధతిలో అవసరమైన వైద్య సలహాలు, సూచనలు ఇస్తారు. అవసరమైతే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. కుటుంబంలోని వ్యక్తుల వారీగా ఆరోగ్య రికార్డులు తయారు చేస్తారు. ఆహారపు అలవాట్లు, వ్యసనాలను తెలుసుకుని నమోదు చేస్తారు. అవసరాన్ని బట్టి బీపీ, షుగర్, కిడ్నీ, లివర్, గుండె పనితీరు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాన్సర్ స్క్రీనింగ్, ఇతర వైద్య పరీక్షలు చేయిస్తారు. అనారోగ్య సమస్యలు ఉంటే వైద్య సలహాలు ఇస్తారు. మందులు సూచించి ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. పిల్లలకు వ్యాక్సిన్లు ఇస్తారు. గర్భిణులకు రెగ్యులర్ చెకప్‌లపై అవగాహన కల్పిస్తారు. రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. ఆ ప్రాంతంలోని ప్రజలకు తరచూ వచ్చే వ్యాధులను గుర్తిస్తారు. నాలుగేళ్ల ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యేదాకా వారి దత్తత కుటుంబాల ఆరోగ్య పరిస్థితుల పర్యవేక్షణ ఆయా విద్యార్థుల చేతుల్లోనే ఉంటుంది. ఎంబీబీఎస్ పూర్తయ్యే సమయంలో దత్తత కుటుంబాల ఆరోగ్య పరిస్థితులపై పూర్తిస్థాయిలో విద్యార్థులు తయారు చేసిన ఫైనల్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

మాకూ అవగాహన వస్తుంది



ఇద్దరికీ కలిపి ఐదు కుటుంబాలను దత్తత ఇచ్చారు. ఆయా కుటుంబంలోని ప్రతీ ఒక్కరి ఆరోగ్య వివరాలు తెలుసుకుని, నమోదు చేసుకుంటుండటంతో మాకూ వ్యాధులపై అవగాహన వస్తోంది. వైద్య విద్యలో కుటుంబాన్ని దత్తత తీసుకోవడం పాఠ్యాంశంగా మార్చడంతో ఆయా కుటుంబంలోని ఆరోగ్య పరిస్థితులను నాలుగేళ్ల వరకు పరిశీలించే అవకాశం కలిగింది.

– శ్రీవైభవి, ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్

ప్రాక్టికల్ నాలెడ్జి పెరుగుతుంది



నేను దత్తత తీసుకున్న కుటుంబంలో ఐదుగురు సభ్యులున్నారు. వారిలో అనారోగ్య సమస్యలు లేకపోయినా, ప్రతీ వారం వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్నాను. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాను. వైద్య విద్యను కాలేజీలో అభ్యసిస్తున్నా.. ప్రాక్టికల్‌గా ఆరోగ్య సమస్యలు సమీక్షిస్తేనే మాకు అవగాహన పెరుగుతుంది.

– శ్రావణ్, ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్

విద్యార్థులకు తప్పనిసరి



మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు నిరుపేద, పేద కుటుంబాలను దత్తత ఇస్తున్నాం. వైద్య విద్యార్థులు వారు దత్తత తీసుకున్న కుటుంబాల వద్దకు వారంలో ఒకసారి వెళ్లి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటారు. నాలుగేళ్ల వైద్యవిద్య పూర్తయ్యే వరకు ఆయా కుటుంబాల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తారు. వివరాలు నమోదు చేసి ఫైనల్ ఇయర్‌లో వారు రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

– ఎండీ సులేమాన్, మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

పూర్తి చేసిన పనులకే టెండర్లు

- మున్సిపాలిటీలో అవినీతి



టెండర్‌లో చేర్చిన నెల క్రితం వేసిన సీసీ రోడ్డు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పూర్తి చేసిన పనులకు టెండర్లు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అభివృద్ధి పనులను మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా చేపడుతుండగా, ఇష్టారీతిన పనులు పూర్తి చేస్తున్నారు. మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కార్యాలయం నుంచి టెండర్లను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల వరకు గడువు విధించారు. 23వ వార్డులోని స్లాటర్ హౌస్ సమీపంలో నెల క్రితం పూర్తయిన సీసీ రోడ్డు, డ్రెయినేజీపై ర్యాంప్, మిగతా సీసీ రోడ్డు పనులకు టెండర్లు ఆహ్వానించారు. సీసీ రోడ్డు పనులు నెల క్రితమే పూర్తిచేయగా, డ్రెయినేజీపై ర్యాంపు, మిగతా సీసీ రోడ్డును శుక్రవారం ఆఘమేఘాల మీద పూర్తి చేశారు. ఓవైపు టెండర్లు ఆహ్వానించి, మరోవైపు ఆయా పనులను ఇతర కాంట్రాక్టర్లు ఆఘమేఘాల మీద పూర్తి చేశారు. అత్యవసరమైన పనులు కాకపోయినా వాటిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే పూర్తి చేశారా.. అధికారులకు తెలిసే చేశారా.. అనేది తెలియాల్సి ఉంది. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.04 లక్షలు, ర్యాంప్‌తో పాటు మిగతా సీసీ రోడు నిర్మాణానికి రూ.1.61 లక్షలుగా పేర్కొంటూ మున్సిపల్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ రెండు పనులు ముందే పూర్తి చేయడంతో, టెండర్ల ద్వారా ఆయా పనులు పొందిన వారికి ఏ పనులు అప్పగిస్తారో మరి. ఈ విషయమై మున్సిపల్ ఏఈ రాజేందర్‌ను వివరణ కోరగా, తాము సూచించిన పనులు ఏ మేరకు చేయాలని సూచించామో అంత వరకు చేస్తేనే బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. టెండర్లలో పొందిన పనులు లేనిపక్షంలో ఛేంజ్ ఆఫ్ వర్క్ పేరిట పనులు మార్చి, మున్సిపల్ తీర్మానం చేసి ఇతర అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

పత్తిదే ప్రథమ స్థానం



నెన్నెలలో సాగవుతున్న పత్తి

- జిల్లాలో 1.87లక్షల ఎకరాల్లో సాగు
- గతేడాది 'మద్దతు' కంటే అధిక ధర
- ఈసారీ ఉంటుందని రైతుల ఆశలు
- వరి, పప్పు దినుసుల సాగు అంతంతే..

మంచిర్యాలఅగ్రికల్చర్: గత నెలలో విస్తీరంగా వర్షాలు కురవడంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెల 20తో పత్తి విత్తుకునే గడువు ముగిసింది. ప్రస్తుతం పత్తిలో కలుపు తీత, ఎరువు వేయడం, క్రిమిసంహారకాల పిచికారీ పనులు చేస్తున్నారు. గతేడాది పత్తికి మద్దతు ధర కంటే క్వింటాల్‌పై రూ.501 వరకు అదనంగా లభించడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో పత్తి సాగుకే ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది 1.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈసారి ఇప్పటివరకు 1.48 లక్షల ఎకరాల్లో విత్తుకున్నారు. జూన్‌లో తొలకరి వర్షాలకు విత్తుకున్న పత్తి పంటలో రైతులు మొదటి, రెండో దఫా కలుపు తీస్తున్నారు. దౌర కొడుతున్నారు. ఎరువులు వేస్తున్నారు.

జిల్లాలో 3.42లక్షల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది జిల్లాలో 3.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ప్రధానంగా పత్తి, వరి సాగు ఉంటుందని.. ఇందుకు అనుగుణంగా ఎరువులు సిద్ధం చేశారు. ఇప్పటివరకు 1,87,757 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో అధికంగా పత్తి 1,48,386 ఎకరాల్లో సాగు చేశారు. 9,602 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇంకా 1,18,105 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. గతేడాది 1.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ ఏడాది 1.62 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 88 శాతమే పత్తి విత్తుకున్నారు. ఇతర పంటలు 29,769 ఎకరాల్లో సాగు చేసుకున్నారు. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించినా రైతులు ఆసక్తి చూపలేదు.

ఆలస్యంగా వరి సాగు

గత నెల 18నుంచి 27వ తేదీ వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన భారీవర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, జలాశయాలు నిండాయి. వర్షాలు ఆలస్యం కాగా, దీర్ఘకాలిక రకాలను జూలై 20 వరకే నాట్లు వేసుకోవాలని, 30 వరకు మధ్య కాలిక, ఈ నెల 15 వరకు స్వల్పకాలిక రకాలను నాటు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాగా, రైతులు జూలై చివరలో వరి నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం వానలు కురుస్తుండడంతో వరి నాట్లకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండగా సాగు విస్తీర్ణం క్రమేపి పెరిగే అవకాశముంది. ప్రస్తుతం వరి సాగు మినహా ఇతర పంటలు విత్తుకునే గడువు ముగిసింది. జూన్‌లో నారు పోసుకున్న రైతులు వర్షాలు లేక నారుమడులను వదిలేశారు. భారీ వర్షాలకు జలాశయాలు నిండడంతో మరోసారి నార్లు పోసుకున్నారు.

'స్థానిక' సమరానికి సన్నద్ధం

- సీఎం ప్రకటనతో చర్చకు ఊతం
- గ్రామాల్లో వేడెక్కనున్న రాజకీయం
- మూడుదశల్లో ఎన్నికల నిర్వహణ
- ఇక ప్రజల్లోకి వెళ్తున్న ఆశావహులు



మంచిర్యాల జిల్లా పరిషత్ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక సంస్థల ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2తో పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. దీంతో పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. నిబంధనల ప్రకారం ప్రత్యేకాధికారుల పాలన మూడు నెలలకు మించి కొనసాగించడానికి వీలులేదు. పాలన ముగిసి ఆరు నెలలు దాటడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోయే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఓటరు జాబితాలను ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. కాగా, ఎన్నికలు పాత రిజర్వేషన్ల ప్రకారమే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు కూడా అధికారులు సిద్ధం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా బాక్సులు తెప్పించారు. ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ వచ్చేలోపు జిల్లాలో ఓటరు జాబితా తయారీ, బ్యాలెట్ బ్యాక్సులు సమకూర్చడం, బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు పూర్తి చేసే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

గాడి తప్పిన పాలన

సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేకాధికారులు వారి బాధ్యతల్లో బిజీగా ఉండగా పాలన గాడి తప్పింది. ఇప్పటికే పలుసార్లు పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని తెలిపినా అధికారుల్లో స్పందన రావడం లేదు. ప్రస్తుతం వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశముంది. ప్రతీ చిన్న పనికి ప్రత్యేకాధికారుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. వారు అందుబాటులో లేని సమయాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందుల మధ్య నెట్టుకువస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల నిలిచింది. రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు కూడా ఏడాదిగా నిలిచాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో సొంత డబ్బులతో పనులు పూర్తి చేయగా బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

జిల్లాలోని ఆయా స్థానాల వివరాలు

గ్రామపంచాయతీలు	311
వార్డు స్థానాలు	2,730
మండల ప్రాదేశిక స్థానాలు	130
జిల్లా ప్రాదేశిక స్థానాలు	16
మండల పరిషత్ స్థానాలు	16

ప్రజల్లోకి ఆశావహులు

'స్థానిక' ఎన్నికలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో గ్రామాల్లో సందడి మొదలైంది. ఆశావహులు ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో రెండు పంచాయతీ డివిజన్లలో 16 మండలాలు, 311 గ్రామ పంచాయతీలు, 2,730 వార్డులున్నాయి. ఆగస్టు మొదటి వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. జిల్లా నుంచి ఆపరేటర్లను ఇప్పటికే ఎంపిక చేయగా వీరిని శిక్షణకు పంపించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

మంచిర్యాలటౌన్: డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టియాన జెడ్ చెంగ్తూ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సంచాలకుడు డాక్టర్ బీ రవీందర్‌నాయక్, రాష్ట్ర మున్సిపల్ శాఖ సంచాలకుడు వీపీ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డెంగీ నియంత్రణకు ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వైద్యశిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో డెంగీ నిర్ధారణకు ఆర్డీ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలిసా పరీక్ష చేసి డెంగీని నిర్ధారించాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అంటువ్యాధులు, విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో వ్యాధుల వ్యాప్తి నియంత్రణ, పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, డాక్టర్ ప్రసాద్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

సాక్షి ఎఫెక్ట్..



సమస్య తెలుసుకుంటున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. 'సాక్షి'లో గత నెల 31వ తేదీన 'సెల్లార్లు అద్దెకే' శీర్షికన ప్రచురించిన కథనానకి ఆయన స్పందించారు. మార్కెట్ ఏరియాలో సెల్లార్లు, పార్కింగ్ సమస్యను శుక్రవారం పరిశీలించారు. రోడ్డు ఆక్రమించుకుని పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నవారికి ఇదివరకే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వ్యాపారులు తమ షాపుల వద్దే వినియోగదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సిలాల్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలున్నారు.

అత్తను చంపిన అల్లుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో గత నెల 13వ తేదీన అత్తను హత్య చేసి తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అల్లుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చున్నంబట్టివాడకు చెందిన నెల్లి విజయ-శేఖర్ దంపతుల కూతురు మాళవికను ఆరు నెలల క్రితం స్థానిక భగవంతంవాడకు చెందిన శాతం వెంకటేశ్ పెళ్లి చేసుకుని అత్తగారింట్లోనే ఉంటున్నాడు. కొంతకాలంగా వెంకటేశ్ భార్య మాళవిక, అత్త విజయ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో వెంకటేశ్ గత నెల 13న మద్యం మత్తులో విజయతో గొడవపడ్డాడు. ఇంట్లో ఉన్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి విజయను హత్య చేశాడు. అనంతరం తానూ గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా గురువారం డిశ్చార్జి అయ్యాడు. అతడు జగిత్యాలలో ఉండే తన అన్నయ్య ఇంటికి పారిపోయేందుకు ప్రయత్నించగా.. స్థానిక బస్టాండ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ల బదిలీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు బదిలీ అయ్యారు. లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి డీఐఈవోగా విధులు నిర్వహిస్తున్న శైలజ జగిత్యాల జిల్లా ధర్మపురికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు లక్సెట్టిపేటకు బదిలీ అయ్యారు. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లగా, గోదావరిఖని బాలికల కళాశాల నుంచి అంజయ్య మంచిర్యాల కళాశాలకు బదిలీపై వచ్చారు. మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కిష్టయ్య మహబూబాబాద్‌కు వెళ్లగా, ఖమ్మం నుంచి శ్రీనివాసరావు మందమర్రి కళాశాలకు బదిలీపై వచ్చారు. జైపూర్ ప్రిన్సిపాల్ వీరస్వామి మహబూబాబాద్ జిల్లా బయ్యారం కళాశాలకు బదిలీ కాగా, బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజయ్య ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. జన్నారం ప్రిన్సిపాల్ శరత్ వేములవాడకు బదిలీపై వెళ్లగా, ఇక్కడ ఎవరినీ నియమించకపోవటంతో సీనియర్ లెక్చరర్‌కు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కాసిపేట ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన రవీందర్ రిటైర్డ్ కాగా, రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాసిపేటకు బదిలీపై వచ్చారు. ఆయా కళాశాలల్లో నూతనంగా బదిలీపై వచ్చిన ప్రిన్సిపాల్‌లు బాధ్యతలు స్వీకరించారు. డీఐఈవోగా విధులు నిర్వహించిన శైలజ బదిలీపై వెళ్లగా, ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేసేందుకు సీనియర్ ప్రిన్సిపాల్‌ల వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

అద్దెకు ఆర్టీసీ బస్సులు

ఆదిలాబాద్: వివాహాలు, విహారయాత్రలు, శుభకార్యాలకు సంబంధించి అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో బస్సులను ముందస్తు బుక్ చేసుకుని సేవలు పొందవచ్చని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోలకు సంబంధించి 99592 26002, నిర్మల్ 99592 26003, మంచిర్యాల 99592 26004, భైంసా 99592 26005, ఆసిఫాబాద్ 99592 26006 సెల్ నంబర్లలో డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెక్యూరిటీ గార్డుల బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు సీనియర్ సెక్యూరిటీ గార్డులను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ (కార్పొరేట్) నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. బండిపెల్లి రమేశ్‌ని ఎస్బీ (హైదరాబాద్), జవాజి బాబుని రామగుండం-2 డివిజన్, జంగ కృష్ణస్వామిని మణుగూరుకు, అనుగుల రాజయ్యని భూపాలపల్లి డివిజన్‌కు బదిలీ చేశారు. మందమర్రి ఏరియాలోని ఒక సీనియర్ సెక్యూరిటీ గార్డు తనకు ఎస్బీ(హైదరాబాద్) విభాగానికి బదిలీ కావాలని గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. బదిలీ ఉద్యోగులకు సంస్థ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ పేరిట వారి బేసిక్‌ను బట్టి చెల్లిస్తోంది. ఆ గార్డుకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ లేకుండా జరగాల్సిన బదిలీని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ పేరిట చేయడంతో సంస్థకు ట్రాన్స్‌పోర్ట్ పేరిట రూ.70 వేల నుంచి 80 వేలు నష్టం జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే సింగరేణిలో రెండు మూడేళ్లకోసారి జరగాల్సిన అధికారుల బదిలీల్లో జాప్యం జరుగుతోంది. సింగరేణి వ్యాప్తంగా 200లకు పైగా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్లో అధికారుల బదిలీలు జరగాల్సి ఉంది. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ఒక్కో అధికారికి రూ.లక్షా 50 వేల నుంచి రూ.2 లక్షల వరకు సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. దాని వల్లనే బదిలీలు జరగడం లేదనే పలువురు పేర్కొంటున్నారు.

ఆటో బోల్తాపడి సౌత్‌క్యాంపస్ విద్యార్థి మృతి

కామారెడ్డిక్రైం: ఆటో బోల్తాపడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా సొంగ్టి గ్రామానికి చెందిన బేదడ్కర్ ప్రీతమ్(27) భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఉంటూ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనులపై శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చాడు. అతడు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా థియేటర్ రోడ్ క్రాసింగ్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో ప్రీతమ్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ప్రీతమ్ తండ్రి రాంకిషన్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ప్రీతమ్ మృతితో సౌత్‌క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుప్టి.. కదలిక

- రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.234 కోట్లు
- భూపరిశీలనలో అధికారులు
- ముందు ముంపు పరిహారం తేల్చాలంటున్న రైతులు


నేరడిగొండ మండలం కుప్టి వద్ద భూములను గురువారం పరిశీలిస్తున్న అధికారులు

ప్రాజెక్ట్ స్వరూపం ఇలా..

నీటి నిల్వ సామర్థ్యం	5.30 టీఎంసీలు
నీటిమట్టం	394.00 మీటర్లు
జలమార్గం	
రేడియల్ గేట్లు స్పిల్‌వేతో నిర్మాణం	

ముంపు గ్రామాలు..

నేరడిగొండ మండలంలోని కుమారి, గాజిలి, గాంధారి, కుప్టి

గడిచిన నాలుగేళ్లుగా డీపీఆర్ అంచనా వ్యయం వివరాలు..

సంవత్సరం	డీపీఆర్ అంచనా వ్యయం
2020-21	రూ.846.737 కోట్లు
2021-22	రూ.900 కోట్లు
2022-23	రూ.1,100 కోట్లు
2023-24	రూ.1,323 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: ఎట్టకేలకు కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.234 కోట్ల పద్దు కేటాయించింది. తొమ్మిదేళ్లుగా ఇప్పుడు.. అప్పుడు అంటూ వచ్చిన ఈ ప్రాజెక్టు విషయంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. బడ్జెట్ కేటాయింపు నేపథ్యంలో సాగునీటి, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రాజెక్టు అమరిక కోసం భూమిని పరిశీలించారు. కాగా ముంపు భూములకు పరిహారం తేల్చిన తర్వాతే ఏదైనా అని నిర్వాసితులు స్పష్టం చేస్తూ అధికారుల చర్యలను అడ్డుకుంటున్నారు.

2500 ఎకరాలు..

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం నాలుగు గ్రామాల్లో 2,500 ఎకరాలు అవసరం అవుతుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. తాజాగా బడ్జెట్ మంజూరు తర్వాత దీనికి సంబంధించి పూర్తిస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. 900 ఇళ్లు కూడా కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నిర్వాసితులు ముందుగా పరిహారం ఎంత ఇస్తారనేది తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాతే దీనిపై సర్వే చేసుకోవాలని చెబుతున్నారు.

కడెం ఆయకట్టు స్థిరీకరించేందుకు..

బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. అయితే ఈ ప్రాజెక్టు వానాకాలంలో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. ప్రతి పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాలకు మాత్రమే కడెం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్టు ఎగువన ఉన్నటువంటి పరివాహక ప్రాంతమైనటువంటి కుప్టి వద్ద ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని తొమ్మిదేళ్ల క్రితం.. అంటే 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కడెం ఆయకట్టుకు అనుబంధంగా ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంటుంది. 2020-21 నుంచి పలుమార్లు డీపీఆర్ మారుతూ రాగా అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది.

సామర్థ్యం పెంచే అవకాశాలు లేకపోవడంతో..

కడెం ప్రాజెక్టును 1958 సంవత్సరంలో నిర్మించారు. 7.20 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్టి గ్రామం నుంచి నీటి పరివాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్టుకు చేరుతుంది. బచావత్ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ కడెం వద్ద అటవీ సంపదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతోనే ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి బీజం వేసింది. ఇందులో భాగంగానే కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం వంటి ప్రయోజనాలతో దీన్ని చేపట్టాలని యోచిస్తున్నారు.

ప్రధాన ప్రయోజనాలు..

- మూడు మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి
- బోథ్ నియోజకవర్గంలో భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా కొత్తనీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం చాలా కాలం పాటు ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకుల ద్వారా ఆదాయం సమకూరుతుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరి నదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

వివరాలను ముందుంచి ప్రాజెక్టు పనులు చేయాలి..



ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్‌ను ప్రజల ముందు ఉంచి నిర్వాసితుల భూములకు సంబంధించి న్యాయబద్ధమైన రేటు నిర్ణయించాలి. భూములు, ఇళ్లు కోల్పోతున్న నిరుపేదలకు న్యాయం చేయాలి. పునరావాసం కల్పించాలి. రీహాబిటేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను విధానపరంగా ప్రజల ముందుంచి తర్వాతే చేపట్టాలి.

– గడ్డం భీంరెడ్డి, కుమారి గ్రామం

భూసేకరణ కోసం సర్వే..



కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదట భూసేకరణ కోసం రెవెన్యూ విభాగంతో కలిసి సాగునీటిపారుదల శాఖ అధికారులం ముందుకెళ్తున్నాం. గతంలో ఇంత భూమి కావాలని అంచనా వేయడం జరిగింది. తాజాగా రెవెన్యూ పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆ భూమిని నిర్ధారించడం జరుగుతుంది.

– భీంరావు, డీఈ, సాగునీటి పారుదల శాఖ, ఆదిలాబాద్

ప్రాజెక్టు వివరాలు వెల్లడించాకే పనులు చేపట్టాలి

- సర్వేను అడ్డుకున్న కుప్టి ప్రభావిత గ్రామస్తులు


ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నేరడిగొండ: మండలంలోని కుప్టి వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు వివరాలు వెల్లడించాకే పనులు చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. గురువారం స్థల పరిశీలనకు వచ్చిన ఉన్నతాధికారులను స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులు కుప్టి వద్ద జెండాలు పాతేందుకు చేరుకున్నారు. ఈ క్రమంలో కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములు, నివాస గృహాలకు పరిహారం తేల్చిన తర్వాతే పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఆ తర్వాతే స్థల నిర్ధారణ, అలైన్‌మెంట్ పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం గ్రామస్తులు ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

49 కేసులు.. 80 మందికి జైలు

- రూ.59 వేలు జరిమానా
- నేరం చేసిన వారికి శిక్షలు తప్పవు
- రామగుండం సీపీ శ్రీనివాసులు


సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: నేరం చేసిన వారికి శిక్షలు తప్పవని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు ఓ ప్రకటనలో హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి గత జూలై వరకు వివిధ నేరాలు జరిగాయని పేర్కొన్నారు. ఏడునెలల వ్యవధిలో 49 కేసుల్లో 80 మందికి జైలుశిక్ష పడ్డాయని, రూ.59 వేలు జరిమానా రూపంలో చెల్లించారని తెలిపారు. నేరం చేసినవారికి శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్ అధికారి సాక్ష్యాదారాలు సేకరించాలని పేర్కొన్నారు. దర్యాప్తులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి


ఎమ్మెల్యే వివేక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సింగరేణి బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని కోల్ ట్రాన్స్‌పోర్టు లోడింగ్, అన్ లోడింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ వలీ, సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో చెన్నూర్, రామగుండం, ఇల్లందు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, మక్కాన్‌సింగ్ ఠాకూర్, కోరం కనకయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులు 40 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. లోడింగ్ కార్మికులతో సొసైటీలు ఏర్పాటు చేసి యాజమాన్యం వేతనాలు ఇవ్వాలన్నారు. భూపాలపల్లి శ్రీరాంపూర్, మణుగూరు ఏరియాల నాయకులు పాల్గొన్నారు.

కిరాణా సామగ్రి దగ్ధం

గుడిహత్నూర్: మండలంలోని గురుజ గ్రామంలో గురువారం రాత్రి కిరాణా షాపులో దేవుని చిత్రపటాల వద్ద వెలిగి ఉన్న దీపం కిందపడి కార్టూన్ డబ్బాలకు తగిలి మంటలు చెలరేగింది. అగ్నికి కిరాణా సామగ్రి దగ్ధమైంది. ఫర్నిచర్‌తో సహా సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలు నేతుల మమత తెలిపింది.

విధులకు వెళ్తూ..కానరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్: విధులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై నెల్కి సుగుణాకర్ కథనం ప్రకారం.. రామకృష్ణాపూర్‌లోని కుర్మపల్లిలో నివాసం ఉండే బైర శ్రీనివాస్ (31) రామగుండం జీడీకే-1 ఇంక్‌లైన్‌లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి జీడీకే-1 ఇంక్లైన్‌లో రెండో షిఫ్టునకు వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరాడు. మందమర్రి శ్రీరాంపూర్ జాతీయ రహదారి బైపాస్‌పై సీసీసీ ముక్కిడిపోచమ్మ ఆలయ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో శ్రీనివాస్ కిందపడిపోయాడు. వెనుక నుంచి వచ్చిన లారీ అతడిపై వెళ్లింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని వాహనదారులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి బక్కయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బహిర్భూమికి వెళ్లి.. ఫిట్స్‌తో వాగులో పడి


సత్తయ్య (ఫైల్)

భీమిని: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ఫిట్స్ రావడంతో వాగులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కొవ్వూరి సత్తయ్య (47) గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం స్థానిక ఎర్రవాగుకు బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం ఆయనకు ఫిట్స్ రావడంతో వాగులో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే సత్తయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు అంజన్న ఉన్నారు. ఈ విషయమై ఎస్సై విజయ్‌కుమార్‌ని సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వైద్యులు, ఫార్మసిస్టులను నియమించాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు ఫార్మసిస్టులను నియమించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి స్థితిగతులను వివరించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేసి కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. దీంతో సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు వెంకటేశ్, సంపత్, నాయకులు మంగీలాల్, సత్యనారాయణ, చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌కు వినతి

ఏరియా ఆసుపత్రిని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. స్పెషలిస్టు వైద్యులు, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. ఈమేరకు సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి బెల్లంపల్లికి సీఎంఓను పంపిస్తానని చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. నాయకులు రాజమొగిలి, జయరాం, అఫ్జల్, చిప్పనర్సయ్య, మల్లేశ్, ఐలయ్య, మణిరాంసింగ్, గోపాల్, చాంద్‌పాషా, ఓజియార్, మహేందర్, రాజన్న, శంకర్, పోశమల్లు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో సత్తెమ్మ ఇంటి ఆవరణలో 60 గుడుంబా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ లచ్చన్న తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నారంలో గుడుంబా అమ్ముతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 60 గుడుంబా ప్యాకెట్లు లభించాయి. ప్యాకెట్లతోపాటు మహిళను తదుపరి విచారణ నిమిత్తం రామకృష్ణాపూర్ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుడుంబా విక్రేతపై కేసు


కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన గుడుంబా విక్రేత జాదవ్ అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. అక్రమ మార్గాన గుడుంబాను ఇంట్లో తయారు చేసి గ్రామంలో విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. శుక్రవారం ఐదు లీటర్ల గుడుంబా డబ్బా పట్టుకుని విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా ఇంటివద్దే పట్టుకున్నామని తెలిపారు.

పారదర్శకంగా జనరల్ మజ్దూర్ల భర్తీ


కార్మికులతో మాట్లాడుతున్న ఎస్కే బాజీ సైదా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి యాజమాన్యం ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిందని, అండర్ గ్రౌండ్‌లో అన్ని కేటగిరీల వారు దరఖాస్తు చేసుకునే అవకాశం మొదటిసారిగా తాము గెలిచిన తరువాత కల్పించామని పేర్కొన్నారు. సీనియారిటీ, మార్కుల జాబితాలో పొరపాట్లు ఉంటే కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కార్మికులు ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్మికులు పాన్‌కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోకపోవడం వల్ల ఆదాయపన్ను శాఖ అధికారులు జీతంలో రికవరీకి ఆదేశాలు ఇచ్చారని, ఇప్పటికైనా కార్మికులు పాన్‌కార్డుకు ఆధార్‌ను లింకు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొముర‌య్య, ఫిట్ సెక్రెటరీ మురళిచౌదరి, నాయకులు తోట మల్లేష్, అంబాల రవి, రాచర్ల రవీందర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


తోకల కృష్ణ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీపూర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోకల కృష్ణ(కిష్టయ్య) కూలీ పనులు, మత్స్యకారుడుగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం కన్నాల శివారులోని తన పొలం వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోకి వచ్చే క్రమంలో రోడ్డుపై ఉన్న టవేరా వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కిందపడి తీవ్ర గాయాలు కావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృష్ణ(52)ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ విషయమై తాళ్లగురిజాల పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

బడిలో పాము కలకలం

- పరుగులు తీసిన విద్యార్థులు
- ఆదిలాబాద్ జిల్లా బట్టిసావర్గాం యూపీఎస్‌లో ఘటన


పామును పట్టుకున్న యువకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని బట్టిసావర్గాం యూపీఎస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా కేకలు వేయడంతో ఏం జరిగిందోనని ఉపాధ్యాయులు, స్థానికులు ఆందోళన చెందారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గదిలో పామును చూసి కేకలు వేస్తూ పరుగు పెట్టారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులకు తెలియజేయడంతో ఓ యువకుడు ఆ పామును పట్టుకున్నాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనం నర్సరీ ఉండడంతోనే పాములు వస్తున్నాయని, రెండో తరగతి గదిలో పామును చూసి చిన్నారులు కేకలు పెట్టారని హెచ్ఎం రవికుమార్ తెలిపారు. పాములతో పాటు ఇతర విషకీటకాలు ఆవరణలో సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లెప్రకృతి వనం నర్సరీని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు.

ఊరు దాటాలంటే.. వాగు దాటాలె



చింతలమానెపల్లి: మండలంలోని గూడెం పంచాయతీ పరిధిలోని శివపెల్లి గ్రామస్తులు ఊరు దాటాలంటే వాగు దాటి రావాల్సిందే. గూడెం చేరుకోవడానికి రెండు వాగులు దాటి 3 కి.మీ బురదలో ప్రయాణం చేయాలి. శుక్రవారం మహిళలు వాగు నుంచి దాటుతూ కనిపించారు. యువకుడు తన బైక్‌ని ఎడ్లబండిపై తరలించారు. అధికారులు స్పందించి గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.